
ఈనాడు మెదక్
గురువారం అక్టోబరు 17, 2024

తూప్రాన్ - సంగారెడ్డి వయా శివ్వంపేట, నర్సాపూర్

పెడచెవిన పెట్టాడు.. ప్రాణాలు తీశాడు



అత్యంత సమీప బంధువులైన ఎనిమిది మంది మంగళవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై ఉల్లాసంగా గడిపారు. ఆ ఆనంద క్షణాలను గుర్తుచేసుకుంటూ బుధవారం మధ్యాహ్నం కారులో స్వస్థలం భీమ్లా తండాకు బయలుదేరారు. మార్గం మధ్యలో నామ్‌సింగ్ కారు వేగంగా నడుపుతుంటే వద్దని వారించారు. అయినా అతను వినలేదని ఫలితంగా ఏడు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. మరో పది నిమిషాల్లో స్వస్థలం చేరుకుంటారనగా ఈ తీవ్ర విషాదం చోటుచేసుకోవడం గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది.

న్యూస్‌టుడే, శివ్వంపేట, తూప్రాన్, వెల్దుర్తి:

అప్పటి వరకు వారంతా పండుగ సంతోషంలో మునిగి తేలారు. ఒకే పేగు బంధంతో పుట్టి పెరిగిన ఏడుగురు క్షణాల్లో జరిగిన ప్రమాదంలో విగతజీవులుగా మారారు. శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామ శివారులో జరిగిన కారు ప్రమాదం మూడు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మరో 5 నిమిషాల్లో ఇళ్లకు చేరుకునే క్రమంలోనే ఈ ప్రమాదం జరిగింది. దనావత్ శివరామ్, దుర్గి దంపతులకు ముగ్గురు కుమార్తెలు శాంతి, ప్రమీలా, అనిత, కొడుకు ధను ఉన్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లిలో నివాసం ఉండే రెండో కుమార్తె ప్రమీలా ఇంట్లో ముత్యాలమ్మ పండుగ నిర్వహించారు. ఇందులో పాల్గొని తిరిగి వస్తుండగా.. శివరామ్, దుర్గి, వీరి కుమార్తె అనిత, ఆమె కుమార్తెలు శ్రావణి, హిందు, నామ్‌సింగ్, ఆయన భార్య శాంతి, కుమార్తె మమతలు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. కారు నడుపుతున్న నామ్‌సింగ్ ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడు.

కుమారుడికి చెప్పకుండా..

శివరామ్ తన కొడుకు ధనుకు చెప్పకుండానే ఇద్దరు అక్కలు, వారి పిల్లలతో కలిసి శుభకార్యానికి వెళ్లారు. దీంతో ధను, భార్య రాజేశ్వరి వారి ముగ్గురు పిల్లలు ఇంటి వద్దే ఉన్నారు. ఘటన స్థలానికి వచ్చిన ధను.. తల్లిదండ్రులు, అక్కలు, కోడళ్ల మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు.

వాగులో పడటంతోనే..

వాగులో కారు పడి మునగడంతో డోరులు తెరుచుకోక ఏడుగురు మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. రోడ్డుపై పడితే ప్రాణాలు పోయేవి కాదని స్థానికులు భావిస్తున్నారు. కల్వర్టు వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

భూమి అమ్మి.. కారు కొని..

నామ్‌సింగ్ తనకున్న భూమిలో కొంత అమ్మి ఇటీవలే పాత కారు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి దేవాలయాలు, శుభకార్యాలకు వెళ్తున్నాడు. తల్లి, చెల్లె మృత్యువాత పడడం, తండ్రి తీవ్రగాయాల పాలు కావడంతో కొడుకు రాజేశ్ దిక్కుతోచని స్థితి నెలకొంది.


నామ్‌సింగ్

మధ్యాహ్నం 2-2.30: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపురంలో బయలుదేరిన సమయం.

3.45-3.50: ప్రమాదం జరిగింది.

గ్రామస్థులు గుర్తించింది: సాయంత్రం 5 గంటల ప్రాంతంలో

మృతదేహాలు వెలికితీసింది: 6 గంటల ప్రాంతంలో..

ఇరుకు కల్వర్టు..

ప్రమాదం చోటు చేసుకున్న రహదారి విస్తరణ పనులకు గత ప్రభుత్వం రూ. 18 కోట్లు మంజూరు చేసింది. కొన్ని నెలల క్రితం ఈ పనులను అధికారులు ప్రారంభించారు. ఈ రోడ్డును ఉసిరికపల్లి చౌరస్తా నుంచి వెల్దుర్తి రోడ్డును పాంబండ వరకు విస్తరించేందుకు పనులు చేపట్టారు. ఒక వరుస రోడ్డును విస్తరణ చేస్తున్నారు. కానీ ప్రమాదం చోటు చేసుకున్న కల్వర్టును మాత్రం విస్తరించలేదు.


పొక్లెయిన్‌తో కారును వెలికితీస్తూ..

అతివేగమే కారణం: ఎస్పీ

ప్రమాదానికి అతివేగమే కారణమని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కారు నడుపుతున్న నామ్‌సింగ్ మద్యం తాగాడా లేదనే విషయమై డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపడతామన్నారు.

మిన్నంటిన రోదనలు..

తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. కొంత మంది వృద్ధులు సొమ్మసిల్లి పడిపోయారు. శివ్వంపేట మాజీ జడ్పీటీసీ సభ్యుడు పబ్బ రమేశ్‌గుప్తా, తూప్రాన్ పురపాలిక మాజీ ఛైర్మన్ బొంది రవీందర్‌గౌడ్ ఆస్పత్రికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.


విలపిస్తున్న బంధువులు

రూ.5 లక్షల పరిహారం ప్రకటించాలి: హరీశ్‌రావు

నర్సాపూర్: ఉసిరికపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని.. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ● కారు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం కూడా వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పొంచి ఉన్న ముప్పు..



కలగని కనువిప్పు

న్యూస్‌టుడే, నర్సాపూర్, చేగుంట, పెద్దశంకరంపేట: జిల్లాలోని పలు మార్గాల్లో చెరువులు, కుంటలు, కాల్వల వద్ద ప్రమాదం పొంచి ఉంది. రోడ్ల పక్కనే ఉండటంతో ఆదమరిస్తే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. వాహనాలు నడిపే సమయంలో చోదకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలోనూ రోడ్ల పక్కన బావులు, కుంటలు, కాల్వల్లోకి వాహనాలు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినా ప్రభుత్వ అధికారులు కళ్లు తెరవకపోవడంతో, ఇంకా చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. ప్రమాదకర నీటి వనరుల వద్ద రక్షణ చర్యలు చేపట్టకుండా, నిర్లక్ష్యంగా ఉండటంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనేపథ్యంలో 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం...

● 23ఏళ్ల క్రితం రామాయంపేట నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు.. జప్తిశివునూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఐదుగురు జలసమాధి అయ్యారు. 12గంటల పాటు తీవ్రంగా శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు.


పెద్దశంకరంపేట చెరువులోకి దూసుకెళ్లిన బస్సు(పాతచిత్రం)

> గతంలో నర్సాపూర్‌లోనూ ఎక్స్‌ప్రెస్ బస్సు అదుపుతప్పి రాయరావు చెరువులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సు చెట్టును ఢీకొని అక్కడే నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

● 2008లో తూప్రాన్ నుంచి గజ్వేల్ వెళుతున్న కారు యావాపూర్ సమీపంలో ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో కారుపై లారీ పడింది. ఐదు రోజుల తర్వాత లారీని వెలికితీస్తుండగా.. ప్రమాదం వెలుగు చూసింది. కారులో ఉన్న ముగ్గురు మృతి చెందారు.

● పెద్దశంకరంపేట పెద్దచెరువు వద్ద పదేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు చెరువులోకి దూసుకువెళ్లిన ఘటనలో ఒకరు మృతిచెందారు. చెరువు చివర్లో ఈ ప్రమాదం జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ప్రమాదకరంగా నీటి వనరులు...

● మెదక్ మండలం పాతూర్ నుంచి రాయిన్‌పల్లి మార్గంలో రహదారి పక్కనే ఉన్న బావి చుట్టూ దట్టమైన చెట్లు ఉండడంతో కనిపించడం లేదు.

● చిట్యాల నుంచి జానకంపల్లి మార్గంలో సుమారు కిలోమీటరు పొడవునా ఎంఎన్ కెనాల్ రహదారికి పక్కనే ఉంది.

● చేగుంట-గజ్వేల్ మార్గంలో కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద రహదారి పక్కనే నీటితో నిండిన కుంట ఉంది.

● రామాయపల్లి-శెట్టిపల్లికలాన్ రోడ్డుపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు లేవు. ● నార్సింగి వద్ద 44వ జాతీయ రహదారి పక్కనే చెరువు ఉంది.

● వెల్దుర్తి-మెదక్ ప్రధాన రోడ్డుపై ఆరెగూడెం, ఉప్పులింగాపూర్ గ్రామాల మధ్య ఉన్న హల్దీవాగు వంతెనకు రక్షణ గోడలు లేవు.

● కుకునూర్ వద్ద వాగుపై వంతెనకు రక్షణ గోడలు లేవు.

● మానేపల్లి వద్ద సంగాయివాగు వంతెన రక్షణకు ఏర్పాటు చేసిన పైపులు దొంగలు ఎత్తుకెళ్లగా ప్రస్తుతం ప్రమాదకరంగా ఉంది.

● ఉప్పులింగాపూర్-ధరిపల్లి మధ్యన వాగుపై, తూప్రాన్ మండల నాగులపల్లి వాగు వంతెనకు రక్షణ గోడలు లేవు.

- న్యూస్‌టుడే, నర్సాపూర్, మెదక్ రూరల్, చేగుంట, పెద్ద శంకరంపేట, పాపన్నపేట, వెల్దుర్తి

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య: కలెక్టర్

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. పదో తరగతి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని.. అవసరమైతే ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన వంటగదిని పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాల ఆవరణ, మూత్రశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, మరమ్మతులుంటే వెంటనే చేయించాలని ఆదేశించారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పారిశుద్ధ్యం లోపిస్తే ఉపేక్షించం

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే ఉపేక్షించేది లేదని, అధికారులు నిత్యం పర్యటించి మురికి కాలువలను శుభ్రం చేయించాలని అన్నారు. దోమల నివారణ మందు, ఫాగింగ్ చేయాలని, డ్రైడేను నిర్వహించాలన్నారు. ఆకస్మిక తనిఖీల్లో పారిశుద్ధ్యం లోపించినట్లు గుర్తిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఎంపీడీవో దామోదర్, ప్రధానోపాధ్యాయుడు దీప్లా, ఎంపీవో గిరిజారాణిలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మెదక్ రూరల్, రామాయంపేట, పాపన్నపేట, న్యూస్‌టుడే: రైతే దేశానికి వెన్నెముక అని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బుధవారం మెదక్ మండలంలోని పాతూర్, రామాయంపేట మండలం అక్కన్నపేట, పాపన్నపేట మండలం శానాయిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. తరుగు పేరుతో ఎలాంటి కోత విధించవద్దని సూచించారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వివరించారు. గతంలో ధర్నాలు చేస్తే గాని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, ప్రస్తుతం పంట చేతికి వచ్చే ముందే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం మరో రూ.15 కోట్ల నిధులు తెచ్చామన్నారు. అనంతరం మల్లంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, సివిల్ సప్లై డీఎం హరికృష్ణ, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు తదితరులు ఉన్నారు.


శానాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

సామాజిక ఆర్థిక దృక్పథం పుస్తకావిష్కరణ

మెదక్, న్యూస్‌టుడే: ఆర్థిక, సామాజిక అభివృద్ధి, కీలక ఆర్థిక సూచికలను క్రోడీకరించి వివిధ రంగాల్లో రాష్ట్రం ఎలా పురోగమిస్తుందో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం-2024 తెలియజేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం-2024 పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, డీఈవో రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.

భూసేకరణకు సహకరించండి

నర్సాపూర్: ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణానికి రెడ్డిపల్లి గ్రామ రైతులు సహకరించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి కోరారు. రైతులు బుధవారం ఆర్డీవోను కలిశారు. వారు మాట్లాడుతూ తమ భూములు రూ. 3కోట్ల వరకూ ధర పలుకుతున్నాయని, కనీసం రూ. 2కోట్ల వరకైనా పరిహారంగా చెల్లించాలని కోరారు. లేదా భూమి పరిహారంగా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

కొలువుదీరిన కొత్త గురువులు

న్యూస్‌టుడే-మెదక్, పాపన్నపేట, అల్లాదుర్గం, శివ్వంపేట:

సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారు. నెలల తరబడి కఠోర శ్రమ.. ఒకటి, రెండు సార్లు విఫలమైనా.. పట్టుదలతో ఉద్యోగం సాధించారు. చిన్నప్పటి నుంచి నచ్చిన వృత్తిలోకి ప్రవేశించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోస్టింగ్ పొందిన వారు బుధవారం విధుల్లో చేరారు. తొలిరోజు విద్యార్థులకు పాఠాలు బోధించారు.


టేక్మాల్ మండలం మెరుగువాని కుంట తండా పాఠశాలలో బోధిస్తున్న నూతన ఉపాధ్యాయురాలు అమూల్య

269 పోస్టుల భర్తీ

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అధికారంలోకి రాగానే... ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టింది. డీఎస్సీ ఫలితాలు విడుదల చేసి, అభ్యర్థులను ఎంపిక చేసింది. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 310 పోస్టులు ఉండగా.. 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఆహ్వానించారు. వారి ధ్రువపత్రాలు పరిశీలించాక ఎంపిక చేశారు. పలు కారణాలతో కొన్ని పోస్టులు నిలుపుదల చేయగా.. మిగిలిన 272 పోస్టులకు గాను 269 పోస్టులను భర్తీ చేశారు. ఎస్జీటీ రెండు, ఎస్జీటీ ప్రత్యేక విద్య ఒక పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదు.

టేక్మాల్‌లో అత్యధికం....

269 పోస్టుల్లో అత్యధికంగా టేక్మాల్ మండలంలో భర్తీ చేపట్టారు. ఇక్కడ 40 పోస్టులు, పెద్దశంకరంపేట మండలంలో 33, రేగోడ్‌లో 29, అల్లాదుర్గంలో 25, పాపన్నపేటలో 22, మెదక్‌లో 21, చిలప్‌చెడ్‌లో 16, కొల్చారం, నర్సాపూర్, చిన్నశంకరంపేట, శివ్వంపేట మండలాల్లో 9 చొప్పున, వెల్దుర్తిలో 8, తూప్రాన్, హవేలీఘనపూర్, కౌడిపల్లి, రామాయంపేటలో 6, నిజాంపేటలో 5, మనోహరాబాద్‌లో 4, మాసాయిపేట, చేగుంట మండలాల్లో 3 పోస్టులు భర్తీ చేశారు.

16ఏళ్ల కల నెరవేరింది



మా స్వస్థలం అల్లాదుర్గం మండలంలోని మాందాపూర్. 2008 నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నా. ఎస్ఏ గణితం ఉపాధ్యాయుడిగా అల్లాదుర్గం జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో విధుల్లో చేరా.

– వేణు మాధవరెడ్డి, మాందాపూర్, అల్లాదుర్గం

ఇష్టంతో ఉపాధ్యాయుడిగా...



మా స్వస్థలం మెదక్ పట్టణం. చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. దీంతో ఆ దిశగా దృష్టి సారించాను. ప్రైవేట్ పాఠశాలలో బోధించడంతో ప్రతి రోజూ సాధన అవుతుంది. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తా.

– రవికాంత్, పాపన్నపేట ఉన్నత పాఠశాల

మంచి గుర్తింపు తెచ్చుకుంటా



దూరవిద్యలో డిగ్రీ, డీఎడ్ పూర్తి చేశా. 2017లో మొదటిసారి డీఎస్సీ ఒక మార్కుతో ఉద్యోగం కోల్పోయాను. రెండోసారి 34 ర్యాంకు సాధించి శివ్వంపేట మండలం నాను తండా పాఠశాల ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరా. మంచి గుర్తింపు తెచ్చుకునేలా కృషి చేస్తా.

– రాగవి, నాగాపూర్, హవేలీఘనపూర్ మండలం

ఆదాయం ఘనం.. వసతులు అధ్వానం

> నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ విపణి తీరిది

న్యూస్‌టుడే, నర్సాపూర్: నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ విపణి రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందించలేకపోతోంది. రూ.కోట్లు విలువైన పనులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. నిధులున్నా అభివృద్ధి పనులన్నీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాలకవర్గం లేక అభివృద్ధి ముందుకు సాగడం లేదు. ఏటా ఆదాయం పెరుగుతున్నా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు కరువై రైతులు, వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సౌకర్యాలు సున్నా...

అన్నదాతలకు అండగా నిలవాల్సిన వ్యవసాయ మార్కెట్ విపణిలో అనేక సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. ఏడాదికి రూ. 2కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా.. మౌలిక వసతుల కల్పన జరగడం లేదు. నర్సాపూర్‌లో విపణిని 1977లో నోటిఫైడ్ ఏరియాగా గుర్తించారు. దీని పరిధిలోకి ప్రస్తుతం నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, శివ్వంపేట, హత్నూర మండలాలు వస్తాయి. మార్కెట్ రుసుము వసూలు రూ. 2.50 కోట్లుగా ఉంది. 60 వరకు ట్రేడింగ్, 15 వరకు పారాబాయిల్డు బియ్యం మిల్లుల నుంచే మార్కెట్ ఆదాయం వస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులపై నూటికి ఒక శాతం మార్కెట్ రుసుము వసూలు చేస్తున్నారు. చెక్‌పోస్టులు, సీజనల్ చెక్‌పోస్టు, దౌల్తాబాద్‌లో సబ్‌యార్డుల ద్వారా రుసుము వసూలుతో ఆదాయం సమకూరుతుంది. కార్యదర్శి, పర్యవేక్షకులు మినహా అంతా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే. సహాయ, జూనియర్ సూపర్‌వైజర్, టైపిస్టు, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.


నిరుపయోగంగా ఎలక్ట్రానిక్ తూకపు యంత్రం

ప్రతిపాదనలకే పరిమితం....

మూడేళ్ల క్రితం విపణిలో రూ.కోటి నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. రూ.30లక్షలతో ప్రహరీ నిర్మాణంకు నిధులు మంజూరవ్వగా, కొంతమేర చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఏఎంసీ ఆవరణలో 8దుకాణాల సముదాయం రూ.35లక్షలతో చేపట్టారు. పునాదుల వరకు పనులు చేపట్టి విద్యుత్తు తీగలు అడ్డొస్తున్నాయని కొన్ని ఏళ్లపాటు పనులు నిలిపివేశారు. తీగలు తొలగించినప్పటికీ పనులు పునఃప్రారంభించకపోవడం గమనార్హం. స్వాగత తోరణం, రైతుబొమ్మ ఏర్పాటును గాలికి వదిలేశారు. హమాలీలు, రైతులకు వేర్వేరుగా అతిథి గృహాల నిర్మాణం ఉసేలేకుండా పోతుంది. రెండు 40వేల మెట్రిక్ టన్నుల గోదాంలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇందుకు 20ఎకరాల ప్రభుత్వ భూములను 731సర్వే సంఖ్యలో సేకరించారు. కానీ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. గతంలో పశువైద్య శిబిరాలు, మెగా హెల్త్ క్యాంపులను మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టేవారు. వాటిని కూడా చేపట్టడం మానేశారు. ఏఎంసీలో ఎలక్ట్రానిక్ తూకపు యంత్రం నిరుపయోగంగా ఉంటోంది. దీంతో తూకానికి రైతులు బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ఏఎంసీ కార్యదర్శి ప్రతాప్‌గౌడ్ వద్ద ప్రస్తావించగా.. నూతన పాలకవర్గం ఏర్పాటైతే తప్ప అభివృద్ధి పనులు చేపట్టలేమని అన్నారు.



కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

హవేలీఘనపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసింది. ధాన్యంతో తేమశాతం తగ్గించేందుకు రోడ్డు పక్కన రైతులు ఆరబెట్టారు. ఒక్కసారిగా వర్షం పడటంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. దీంతో రైతులు మళ్లీ ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

–న్యూస్‌టుడే, హవేలీఘనపూర్

19న హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి ఈనెల 19న జిల్లాలో పర్యటించనున్నారని, ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్‌లోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అల్లాదుర్గం కోర్టు ప్రారంభోత్సవం, ఏడుపాయల దర్శనం, మెదక్ చర్చి సందర్శిస్తారని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా వైద్యాధికారి శ్రీరాం పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, చిత్రంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్

సోయాబీన్స్ తగ్గుముఖం

న్యూస్‌టుడే, జహీరాబాద్: వర్షాధారంగా సాగు చేసే వాణిజ్య పంటల్లో ప్రధానమైంది సోయాబీన్స్. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు సాగు చేసేవారు. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడం, విపణిలో గిట్టుబాటు ధర లభించక పోవడంతో సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతోంది. దానికి బదులుగా పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారు. దాదాపు రెండు నెలలుగా తరచుగా కురుస్తున్న వర్షాలతో ఈ ఏడు వేసిన కొద్దిపాటి పంట సైతం దెబ్బతినటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, జిల్లాలోని విపణులు వెలవెల బోతున్నాయి. సాధారణానికి భిన్నంగా గత రెండు, మూడేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది.



విపణిలో సోయాబీన్స్ ధాన్యం

సంవత్సరం	రైతులు	ఎకరాలు
2022	40514	76442
2023	20500	41756
2024	15000	35000

మహారాష్ట్రలో మిల్లులు ఎక్కువ

సోయాబీన్ ధాన్యాన్ని నూనె మిల్లుల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. నూనె తీయడంతో పాటు పిండిని కోళ్ల దాణాకు ఉపయోగిస్తుంటారు. మిల్లుల ఏర్పాటుకు మహారాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వరకు రాయితీ ఇవ్వడంతో అక్కడ ఎక్కువగా ఉన్నాయి. మన రాష్ట్రంలో జహీరాబాద్, రామాయంపేట, కరీంనగర్‌లో ఒక్కొక్కటి చొప్పున, హైదరాబాద్‌లో రెండు ఉన్నాయి. జహీరాబాద్‌కు కేవలం వంద కిలోమీటర్ల దూరంలోనే మహారాష్ట్రలో మిల్లులు ఉండటంతో అటు ఎక్కువగా సోయాబీన్స్ తరలిస్తారు.



రాయితీలు ప్రకటించాలి: అతివృష్టి, అనావృష్టిలతో నాలుగేళ్లుగా సోయాబీన్స్ పంట దిగుబడులు పడిపోతున్నాయి. నష్టాలతో సాగు చేయలేక ఇతర పంటల వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం రాయితీలు ప్రకటించి ఆదుకోవాలి. ఈ సంవత్సరం దాదాపు రెండు నెలలుగా ప్రతిరోజు వాన కురుస్తోంది. కనీసం పెట్టుబడులైనా రావడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించాలి.

– గోవింద్‌రెడ్డి, బూచినెల్లి


రూ.144 కోట్ల మద్యం తాగేశారు


- గతేడాది కంటే విక్రయాలు తక్కువ
- సంగారెడ్డి జిల్లాలో మాత్రమే ఎక్కువ


మెదక్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సాధారణంగా పండగ వచ్చిందంటే ముక్క, చుక్క ఉండాల్సిందే. దసరా లాంటి పెద్ద పండగ వస్తే మద్యం తప్పనిసరి. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో గతేడాది దసరా పండగ సీజన్‌ను ఈసారితో పోల్చితే సంగారెడ్డి జిల్లాలో మాత్రమే మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగాయి. మిగతా మూడు జిల్లాల్లో తక్కువ అమ్ముడయ్యాయి. మెదక్ జిల్లాలో కేవలం రెండు రోజుల లోనే రూ. 13.43 కోట్ల విలువైన మద్యాన్ని డిపో నుంచి వ్యాపారులు తీసుకెళ్లారు. మెదక్ జిల్లాలో 48 వైన్స్‌లు, 3 బార్లు ఉన్నాయి. రూ. 59.48 కోట్ల లక్ష్యం పెట్టుకోగా సగమైనా దాటలేదు.


- వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు, 7 బార్లు ఉన్నాయి. మద్యం గొలుసు దుకాణాలు, ధాబాల్లో విచ్చలవిడిగా అమ్మారు.
- ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అమ్మవారి దీక్షలు, శనివారం నాడు పండగ రావడంతో సిద్దిపేట జిల్లాలో అమ్మకాలు తగ్గాయని భావిస్తున్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల జోరుతో పెరిగాయి. గతంతో పోల్చితే రూ. 4.62 కోట్ల మేర ఆదాయం తగ్గింది.
- సంగారెడ్డి జిల్లాలో నిరుడు దసరా కంటే ఈసారి ఐఎంఎల్ లిక్కర్, బీర్ల ద్వారా జిల్లాకు రూ. 2.17 కోట్ల ఆదాయం ఎక్కువ సమకూరింది. 3.66 శాతం వృద్ధి నమోదైంది. ఈ జిల్లాలో 5 అబ్కారీ స్టేషన్‌లు, 101 దుకాణాలు, 34 బార్ రెస్టారెంట్లు ఉన్నాయి.











ఫోన్‌లో ఓటు చూసుకోండి

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: త్వరలోనే స్థానిక సంస్థ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిమిత్తం గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. తుది జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితాలో పేరు ఉందీ లేనిదీ సెల్‌ఫోన్‌లో చూసుకోవచ్చు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే తెలుస్తుంది. tsec.gov.in అని వెబ్‌సైట్‌లో ఎలక్షన్ కమిషన్ పేజీ తెరుచుకుంటుంది. ఫైనల్ రోల్స్ ఐచ్ఛికం కనిపిస్తుంది. జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయగానే మరో పేజీ కనిపిస్తుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా కనిపిస్తుంది. వార్డుల వారీగా అందులో పేరు చూసుకోవచ్చు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



వివరాలు చూపించే పేజీ

పథకాలతో పేదరికం దూరం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో పేదరికం పెరిగితే అశాంతి, అసమానతలతో ప్రజల మధ్య వైరుధ్యాలు చోటుచేసుకుంటాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త చట్టాల ద్వారా, పథకాలతో, బడ్జెట్ కేటాయింపులతో పేదరికాన్ని నిర్మూలించేందుకు లక్ష్యం ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు రచిస్తాయి. కరోనా వ్యాప్తి చెందిన సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఇల్లు, పారిశుద్ధ్యం, బడి కెళ్లడం, పౌష్టికాహారం తదితరాంశాలను గణించి పేదరికం సూచికలను తయారుచేస్తున్నారు. 2023లో నీతి ఆయోగ్ ప్రకటించిన సూచికల మేరకు వికారాబాద్ జిల్లాల్లో పేదరికం .. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్‌లతో పోల్చితే ఎక్కువగా ఉంది. తెలంగాణ జిల్లాల్లోని పేదరికం ప్రకారం వికారాబాద్ 29వ స్థానంతో అధమంలో ఉంది. మొదటి పది ఉత్తమ స్థానాల్లో మిగతా మూడు జిల్లాలున్నాయి. నేడు 'పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా కథనం.



అట్టడుగు జీవితం నుంచి యజమాని వరకు..

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కొద్దిపాటి పొలంలో వ్యవసాయంతో కుటుంబ ఖర్చులు గడిచేవి కావు. పండగలైనా ఒక్కోసారి సరైన ఆహారమే దొరికేది కాదు. అలాంటి స్థితిలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన లింగాయిగారి కొండల్‌రెడ్డి.. వాహనాల మెకానిజం నేర్చుకున్నారు. ఓవైపు చదువుకుంటూనే తండ్రికి పొలంలో చేదోడువాదోడుగా ఉంటూనే ద్విచక్ర వాహనాలపై మోజుతో వీలైన సమయంలో మెకానిజం నేర్చుకున్నారు. రెండు సంవత్సరాల్లో కష్టపడి సొంతంగా మరమ్మతులు చేయడంలో అనుభవం పొందారు. దోమడుగులో మెకానిక్ దుకాణం ప్రారంభించారు. వాటి సంపాదనతో అభివృద్ధి చెంది.. అక్కడే ప్రస్తుతం ఓ ద్విచక్రవాహనాల షోరూంకు యజమానిగా మారారు. సోదరుడు వినోద్‌కుమార్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేస్తున్నారు. ఒకనాడు పేదరికంలో మగ్గిన తాము కష్టపడి మరమ్మతులు నేర్చుకొని నేడు తమ కుటుంబ సభ్యులను సంతోష పెట్టగలుగుతున్నామని పేర్కొన్నారు. మరో పది మందికి ఉపాధి కల్పిస్తుండటం సంతృప్తిగా ఉందని తెలిపారు.



కొండల్‌రెడ్డి

ఉపాధికి కొన్ని పథకాలు

పీఎం స్వనిధి: కరోనా సమయం ప్రతి ఒక్క వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వీధి వ్యాపారాలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. వీధి వ్యాపారులను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. పూచికత్తు లేకుండా రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు రుణాన్ని ఇస్తారు. వ్యాపారాభివృద్ధి చేసుకోవచ్చు.

కార్పొరేషన్ రుణాలు: ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాలతో రాష్ట్ర ప్రభుత్వం వాహనాలు, వ్యాపారాలకు ఇస్తున్నారు. రాయితీలు ఉన్నాయి.

బ్యాంకు లింకేజీ: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అతి ప్రధానమైన పథకాల్లో బ్యాంకు లింకేజీ ఒకటి. ఇది గ్రామాల, పట్టణాల మహిళలను స్వయం సహాయక సంఘాల పేరుతో గ్రూప్‌లుగా చేసి వారికి తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తుంది. సులభంగా తిరిగి చెల్లించవచ్చు. వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు.

శ్రీనిధి: స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీనిధి పేరుతో పథకం తెచ్చింది. పాడి పశువులకు, మేకలు, కిరాణం, పౌల్ట్రీలకు రుణాలు ఇస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చు.

రాజస్థాన్ సదస్సుకు పొట్లపల్లి విద్యార్థి ఎంపిక

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: రాజస్థాన్‌లోని మహరాజా గంగాసింగ్ విశ్వవిద్యాలయంలో జరిగే 61వ ఆలిండియా రాజనీతి శాస్త్రం అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన పరిశోధక విద్యార్థి కల్లెపల్లి ప్రశాంత్‌కు దక్కింది. ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యాభ్యాసాన్ని హుస్నాబాద్, వరంగల్‌లో పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ రాంచంద్రం పర్యవేక్షణలో 'తెలంగాణలో షెడ్యూలు తెగల రిజర్వేషన్ల ప్రభావం' అంశంపై పరిశోధన చేస్తున్నారు. ఈ నెల 18, 19 తేదీలలో రాజస్థాన్ సెమినార్‌లో పాల్గొంటారు. అందులో 'భారతదేశంలో మారుతున్న ప్రజాస్వామ్యం, రాజకీయ అవకాశాల పరిమితులు' అంశంపై ప్రసంగిస్తారు. 'వికసిత్ భారత్ 2047'లో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ప్రశాంత్‌ను గ్రామస్థులు, అధ్యాపకులు అభినందించారు.



కల్లెపల్లి ప్రశాంత్



ఉదయ భానుడు

చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్రం కాదిది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట గ్రామ శివారులో తెల్లవారుజామున ఉదయిస్తున్న సూర్యుడు. గ్రామ శివారులోని కొండల మధ్య నుంచి జ్వాలను తలపించే వెలుగుతో పైపైకి భానుడు వస్తున్నాడు.

– న్యూస్‌టుడే, చిలప్‌చెడ్

బసవేశ్వర ఉత్సవం.. తరలుతున్న భక్తజనం

న్యూస్‌టుడే, జహీరాబాద్: మానవతావాది, లింగాయత్, బసవ ధర్మీయుల ఆరాధ్య దైవం బసవేశ్వరుడికి ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు 'కల్యాణపర్వ' ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్తున్నారు. జహీరాబాద్‌కు 90 కిలో మీటర్ల దూరంలో బసవకల్యాణ్ ఉంది. ఎత్తైన గుట్టపైన, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్యలో 21 ఎకరాల స్థలంలో 108 అడుగుల భారీ విగ్రహాన్ని 2014లో నిర్మించారు. ఆ ప్రాంతానికి 'శరణుశైల'గా నామకరణం చేసి ఏడాదికోసారి కల్యాణ పర్వాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ గుహలు, సొరంగం, బసవేశ్వరుడి బోధనల చిత్రాలు ఉన్నాయి. జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ ప్రధాన కూడళ్ల వద్ద బసవేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామాలలో బృందాలుగా ఏర్పడి ప్రత్యేక వాహనాలు సమకూర్చుకొని బయలుదేరారు.



బసవకల్యాణ్‌లో 108 అడుగుల విగ్రహం

భోజన, వసతి ఏర్పాట్లు చేశాం:



బసవకల్యాణ్ పట్టణంలో మూడు రోజుల పాటు జరుగు కల్యాణపర్వానికి మన ప్రాంతం నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో రానున్నందున తగిన వసతి ఏర్పాట్లు పూర్తిచేశాం. భోజన, వసతి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి కల్యాణపర్వం కార్యక్రమం గురించి భక్తులకు తెలియజేశాం. జహీరాబాద్-ముంబయి జాతీయ రహదారిపై ఉన్నందున రాకపోకలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

–శంకర్ పాటిల్, రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి దుర్మరణం

దుబ్బాక: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన దుబ్బాక శివారులోని పెద్దచీకోడ్ మార్గంలో బుధవారం చోటుచేసుకుంది. మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రైతు సుకూరి భాగయ్య(50), భార్య ఎల్లవ్వతో కలిసి దుబ్బాక మండలంలోని పెద్దచీకోడ్‌లోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చారు. సాయంత్రం భార్యతో కలిసి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పోతారానికి చెందిన గడీల శ్రీనివాస్‌రెడ్డి దుబ్బాకలో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. పెద్దచీకోడ్ వెళ్లే దారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో సుకూరి భాగయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు, శ్రీనివాస్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఫిర్యాదు అందలేదని దుబ్బాక పోలీసులు తెలిపారు.



సుకూరి భాగయ్య

ఉద్యోగం పేరుతో మోసం

హైదరాబాద్: ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. హైదరాబాద్ మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి టెలీకాలర్‌గా పనిచేస్తూ.. మధురానగర్‌లోని యోగితా లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. గతంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కమ్మరి వీరేందర్ పరిచయమయ్యాడు. ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్ సన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. డబ్బులు కట్టనిదే ఉద్యోగం రాదని, పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని వీరేందర్ చెప్పడంతో ఆగస్టు 12 నుంచి ఈనెల 9 వరకు దఫదఫాలుగా రూ. 3.5 లక్షలు చెల్లించింది. మరిన్ని డబ్బులకు వేధిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య తిరిగి రాలేదని మేస్త్రీ ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: దసరా పండుగకు పుట్టింటికి వెళ్లిన భార్యాపిల్లలు చిన్నపాటి మనస్పర్థలతో కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా మిగిలాడు. మద్యం తాగిన మత్తులో భార్యాపిల్లలు గుర్తుకు వచ్చి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. వికారాబాద్ ఎస్‌ఐ సత్యనారాయణరాజు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకాకు చెందిన ఉప్పరి శ్రీకాంత్ (37), రేణుక దంపతులకు సంజన, స్వాతి, బస్వరాజ్, రితీష్‌లు సంతానం. బతుకుతెరువు కోసం ఏడాది కిందట భార్యాపిల్లలతో వచ్చి సిద్దులూర్ శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో ఉంటున్నారు. మేస్త్రి పనిచేసే శ్రీకాంత్ తరచూ మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. దసరా పండుగకు అందరూ కలిసి సంతోషంగా సొంత గ్రామానికి వెళ్లారు. పండుగ అనంతరం భర్తతో సిద్దులూర్‌కు తిరిగి రావడానికి భార్య అంగీకరించలేదు. తీరు మార్చుకుంటేనే పుట్టింటికి వస్తానని వాదనకు దిగింది. అయినా లెక్క చేయకుండా భార్యాపిల్లలను అక్కడే వదిలేసి వచ్చాడు. ఒంటరితనం భరించలేక మద్యం మత్తులో వ్యవసాయక్షేత్రంలోని గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


పండుగకు తల్లిగారింటికి పంపలేదని వివాహిత బలవన్మరణం

చేర్యాల, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పంపలేదన్న కారణంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చేర్యాల మండలం ఆకునూరులో జరిగింది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాలు.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లికి చెందిన ముక్కెల మంజుల-రాంరెడ్డిల కుమార్తె సౌమ్య(22)ను నాలుగేళ్ల క్రితం ఆకునూరుకు చెందిన పెంటపర్తి శ్రావణ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. పండుగకు సౌమ్యను ఆమె భర్త పుట్టింటికి పంపలేదు. మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు ఆమెను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తల్లి మంజుల ఫిర్యాదు చేశారు.



సౌమ్య

కాపాడండీ..



జగదేవపూర్ మండలం తీగుల్ పరిధిలోని పురాతన ప్రార్థన మందిరం

అయ్యలారా.. అమ్మలారా.. మేము చారిత్రక ఆధారాలం. శతాబ్దాల కాలంలో అప్పటి రాజులు తమ అవసరాల కోసం పటిష్ఠంగా నిర్మించారు. ఇప్పటి వరకూ చెక్కుచెదరకుండా ఉన్నాం. ప్రస్తుతం మామీద మొక్కలు, తీగలు పెరిగి, వేళ్లూనుకుంటూ మా పటిష్టతకు భంగం కలిగిస్తున్నాయి. ప్రజలారా.. మీరు ప్రజాప్రతినిధుల ద్వారానో, అధికారుల ద్వారానో, స్వచ్ఛందంగా సేవలు అందించే యువజన సంఘాలతోనో మమ్ములను మీ భవిష్యత్తు కోసం కాపాడండి. పరిసరాల్లో వ్యర్థాలు లేకుండా.. మొక్కలు పెరగకుండా శుభ్రం చేస్తే మీ ఊరికి మేము గుర్తింపు కలిగిస్తామని మరువొద్దు. చరిత్ర సాక్ష్యాలు లేకుంటే భవిష్యత్తు ప్రణాళికలు సక్రమంగా వేయడం కుదరదని గమనించండి. శిథిలం కాకముందే సరి చేయండి.

ఇట్లు మీ ...

సంగారెడ్డి జిల్లా అందోలులో గైని (గడీల ద్వారం), రెడ్డి రాజుల కాలం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్‌లో రెండో నిజాం నవాబు నిర్మించిన ప్రార్థన మందిరం

– న్యూస్‌టుడే, జోగిపేట టౌన్, జగదేవపూర్



అందోలులో గడీ ప్రధాన ద్వారంపై చెట్లు

బోధన వృత్తికి పట్టం.. అక్కన్నపేట విశేషం

- అక్కన్నపేటలో జనాభా 4,545
- 2012 డీఎస్సీలో గ్రామం నుంచి అత్యధికంగా 14 మంది అర్హులు కావడం విశేషం
- గ్రామంలో 1960 నుంచి ప్రభుత్వ ఉద్యోగులు 140
- ప్రస్తుతం ఉపాధ్యాయులు 50 మంది ఉన్నారు.
- ప్రైవేటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా ఉన్నారు.

రామాయంపేట, న్యూస్‌టుడే: ఎవరో ఒకరు.. ఎపుడో అపుడు.. ఒకరిని చూసి మరొకరు అన్నట్టుగా ఆ ఊరిలో అందరూ ఉద్యోగాల బాటలో పయనిస్తున్నారు. ఒకరు ఒక ఇద్దరు కాదు.. ఏకంగా 100 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం విశేషం. రామాయంపేట మండల పరిధి అక్కన్న పేటలో 1,010 కుటుంబాలు ఉన్నాయి. ఊరిలో అన్ని వర్గాల వారు ఉన్నారు. అధికంగా ప్రభుత్వ ఉద్యోగాల వైపు అందులోనూ ఉపాధ్యాయులుగా స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలు నిదర్శనం.

ప్రతి డీఎస్సీలోను చోటు

సాధారణంగా గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే అందులో ప్రభుత్వ ఉద్యోగం ఉంటే ఊరందరికీ తెలిసిపోతుంది. అక్కన్న పేట గ్రామంలో మాత్రం అవి సర్వసాధారణమే. ప్రతి డీఎస్సీలోను ఒకరికి మించి సాధిస్తుండటం విశేషం. ఇలా ఇప్పటివరకు 50 మంది ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్జీటీలో ఇద్దరు.. స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ జిలాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు.

స్వయంపాలన దినోత్సవ స్ఫూర్తి

పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా వ్యవహరించడం స్ఫూర్తి నింపింది. ఆ ఒక్క రోజే కాకుండా ఉపాధ్యాయులుగా ఎదగాలన్న ఆకాంక్ష కలిగిందంటారు.. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచందర్. 1982లో ఉపాధ్యాయుడిగా అర్హత సాధించిన ఆయన స్ఫూర్తితో గ్రామంలో ఇప్పటివరకు 50 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు.

నిపుణులను తయారు చేసేది బోధన వృత్తి



ఉపాధ్యాయ వృత్తి స్వచ్ఛమైనది. సమాజంలోని అన్ని రంగాల్లోనూ నిపుణులను తయారు చేసేది ఉపాధ్యాయులే. భవిష్యత్తు తరాన్ని సవ్యదిశలో నడిపించేది ఈ వృత్తే. గ్రామంలో బోధననే ఎంచుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా.

రామచందర్, విశ్రాంత ఉపాధ్యాయుడు

గిరిపుత్రుడు.. గెలుపు కెరటం

- జమ్మూకశ్మీర్‌లో ఎఫ్‌సీఐ జీఎంగా ప్రస్థానం

న్యూస్‌టుడే, నర్సాపూర్: వారిది నిరుపేద గిరిజన కుటుంబం.. వ్యవసాయం చేస్తేనే పూట గడిచే రోజులవి. పరిస్థితులకు తలవంచలేదు. ఏదో సాధించాలనే తపన... లక్ష్యం చేరుకోవాలనే పట్టుదల... ఎన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధించే వరకు విశ్రమించలేదు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన ఛత్రునాయక్ ఉన్నతంగా ఎదిగారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లోని భారత ఆహార సంస్థలో (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు.



సేంద్రియ ఎరువుతో పూల సాగు

మహ్మదాబాద్ తండా నుంచి..

నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన లున్సావత్ మున్నిభాయ్, తుక్యాల మొదటి కుమారుడైన ఛత్రునాయక్‌కు కాలినడకన బడికి వెళ్లి చదువుకోవాలన్నా సరైన దారి లేక చాలా కష్టంగా ఉండేది. నర్సాపూర్‌కు నడుస్తూ వెళ్లి పదో తరగతి చదివారు. హాలియాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్ జెఎన్టీయూలో పీజీ పూర్తిచేశాక 1989లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో టెక్నికల్ అధికారిగా కేంద్రం ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1977లో ఎఫ్‌సీఐలో సహాయ మేనేజర్‌గా బెంగళూరులో పనిచేశారు. హైదరాబాద్, నల్గొండ, తార్నాక, కరీంనగర్‌లో మేనేజర్‌గా చేశారు. డీజీఎంగా పదోన్నతి లభించడంతో అస్సాం, గవుహాటిల్లో విధులు నిర్వహించారు. జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది ముంబయికి బదిలీ అయ్యారు. మూడు సంవత్సరాల అనంతరం జమ్మూకశ్మీర్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాలకు జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట 1.50 లక్షల టన్నుల బియ్యం సరఫరాకు సంబంధించి విధులు చేపడుతున్నారు.

సేంద్రియ సాగుపై మక్కువ

ఆయనకు సెలవు దొరికితే చాలు మహ్మదాబాద్ తండాకు వస్తారు. పొలాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తారు. బీర, కాకర, వంగ, బెండ, మిర్చి, తీగ జాతి కూరగాయలను రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. పెద్దఎత్తున బంతి పూలను సాగు చేస్తున్నారు. తనకు జన్మనిచ్చిన గడ్డకు ఏదోఒకటి చేయాలనే తపన ఆయనది. ప్రస్తుతం తాజామాజీ ఎంపీటీసీ సంధ్యారాణి ఛత్రూరాయక్ భార్య. కుమారుడు యువహీరో అనురాగ్. 15 ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

చేగుంట, న్యూస్‌టుడే: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం వడియారం శివారులో బుధవారం జరిగింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. వడియారం-మాసాయిపేట రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇతనికి సంబంధించినవారు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో రైతు..

తొగుట, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తొగుట మండలం కాన్గల్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. తొగుట ఎస్సై రావికాంతరావు కథనం ప్రకారం.. ముడికే యాదయ్య(40) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని ముచ్చర్ల నర్సయ్యకు చెందిన వ్యవసాయ భూమివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

పట్టభద్రుల ఓటరు దరఖాస్తులు 277



మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటుహక్కు కోసం అర్హులైన వారు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. నర్సాపూర్ కార్యాలయంలో డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమితులైన ఉప తహసీల్దార్లకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో 277 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకోగా.. 51 ఆమోదించినట్లు తెలిపారు.

పెండింగ్ ధరణి సమస్యలు పరిష్కరించండి: ఆర్డీవో



మాట్లాడుతున్న రమాదేవి

హవేలిఘనపూర్: ధరణి పోర్టల్‌లోని పెండింగు సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో రమాదేవి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలకు ధ్రువపత్రాలను సకాలంలో అందించాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. తహసీల్దార్ సింధూరేణుక, డీటీ నవీన్‌కుమార్ ఉన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు ఆటంకం

పాపన్నపేట: మండల కేంద్రం పాపన్నపేటలోని నెహ్రూ విగ్రహం వద్ద రెండు నియంత్రికల పరిధిలో గురువారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుందని జూనియర్ లైన్‌మన్ అస్లాం తెలిపారు. నియంత్రికల పరిధిలోని విద్యుత్తు లైన్లకు కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహాత్మా.. బాధలు తీరవా?

జ్యోతిబా ఫులే గురుకులంలో కొనసాగుతున్న ఆరు విద్యాసంస్థలు • ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, కౌడిపల్లి

సరిపడా భవనాలు అందుబాటులో లేక అన్ని విద్యాసంస్థలు ఒకే చోట నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకే భవన సముదాయంలో ఆరు విద్యాలయాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులూ అవస్థలు పడుతున్నారు. ఇదీ మండల పరిధి తునికి శివారులోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ మత్స్యకారుల గురుకుల విద్యాలయంలో పరిస్థితి.



తునికి శివారులోని గురుకుల పాఠశాల సముదాయం

పాఠశాల, కళాశాలలు..

గురుకుల పాఠశాలను ఉన్నతీకరించి ఇంటర్ వరకు బోధిస్తున్నారు. పాఠశాలలో అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం గురుకులంలో 5- 10వ తరగతి వరకు 271 మంది, ఇంటర్‌లో 162 కలిపి మొత్తం 433 మంది ఉన్నారు. కౌడిపల్లి మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో కొనసాగిన గురుకుల పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో దాన్ని సైతం తునికి గురుకుల విద్యాలయానికి తరలించారు. ఈ పాఠశాలను సైతం ఇంటర్ వరకు ఉన్నతీకరించారు. దీంతో పాఠశాలతోపాటు కళాశాలను నిర్వహిస్తున్నారు. 5-10వ తరగతి వరకు 404 మంది, ఇంటర్‌లో 104 కలిపి మొత్తం 508 ఆశ్రయం పొందుతున్నారు. కౌడిపల్లి, తునికి పాఠశాలలు, కళాశాలల్లో 943 మంది ఉన్నారు.

రెండు మెదక్ విద్యాలయాలు..

తునికిలో ఇప్పటికే నాలుగు విద్యాసంస్థలుండగా అదనంగా మెదక్ పట్టణానికి సంబంధించిన మరో రెండు ఇక్కడే కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెదక్ పట్టణంలోని బాలుర డిగ్రీ, ఇంటర్ కళాశాలలు రెండేళ్లుగా ఇక్కడే కొనసాగిస్తున్నారు. డిగ్రీ కళాశాలలో 113, ఇంటర్ కళాశాలలో 87 మంది కలిపి 200 మందికిపైగా ఉన్నారు. దీంతో మత్స్యకారుల గురుకుల విద్యాలయం కిటకిటలాడతోంది. రెండు గురుకుల పాఠశాలలు, మూడు కళాశాలలు, ఓ డిగ్రీ కళాశాల ఒకేచోట నడుస్తున్నాయి. వాటిలో మొత్తం 1,150 మంది వరకు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

త్వరలో తరలిస్తాం..: హరిబాబు, ప్రిన్సిపల్

గురుకుల విద్యాలయంలో కొనసాగుతున్న డిగ్రీ, ఇంటర్ కళాశాలలను త్వరలోనే మెదక్ పట్టణానికి తరలిస్తాం. పట్టణంలో అనువైన భవనం దొరకడంతో ఒప్పందం సైతం కుదిరింది. ఎక్కువ మంది విద్యార్థులున్నా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

అంతరాయం లేని నీటి సరఫరాకు కృషి

రేగోడ్: మిషన్ భగీరథ నీటిని అంతరాయం లేకుండా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు డీఈఈ గాయత్రి తెలిపారు. రేగోడ్ వచ్చిన సందర్భంగా బుధవారం మిషన్ భగీరథ నీటి ట్యాంకులు, పైపులైన్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఏర్పడినట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. నీరు కలుషితం కాకుండా అప్రమత్తం చేసి ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని సూచించారు. బీసీవాడలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని స్థానికులు తెలిపారని, సిబ్బందితో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధాన్యం కొనాలని ధర్నా



తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక, రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం నాయకుడు గౌరి, వ్యవసాయ కార్మిక సంఘం నేత నరేందర్ ఆధ్వర్యంలో సంఘాల నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గౌరి, నరేందర్ మాట్లాడుతూ.. ధాన్యం నూర్పిళ్లు ప్రారంభమయ్యాయని, వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం నిలువ చేసుకోవడానికి స్థలాలు లేక రోడ్లపై ఆరబోస్తున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెద్దశంకరంపేట: కమలాపురంలో ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కమలాపురంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు మద్దతు ధరలు చెల్లించి ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయిని మధు, నారాగౌడ్, పెరుమాండ్ల గౌడ్, కుంట్ల రాములు, సంగయ్య, సుభాష్‌గౌడ్, ఏపీఎం గోపాల్ పాల్గొన్నారు.

అల్లాదుర్గం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని తహసీల్దార్ మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని గడిపెద్దాపూర్‌లో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో శంకర్, రైతులు పాల్గొన్నారు.

చేగుంట, రేగోడ్ మండలాల్లో నేడు..

చేగుంట, న్యూస్‌టుడే: మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం లక్ష్మీనర్సమ్మ తెలిపారు. వడియారం, అనంతసాగర్, బి.కొండాపూర్, బోనాల, చందాయిపేట, చేగుంట, చిన్నశివునూర్, కర్నాల్‌పల్లి, కిష్టాపూర్, పులిమామిడి, రాంపూర్, ఉల్లితిమ్మాయిపల్లి, వల్లభాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు.

రేగోడ్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రం రేగోడ్‌లో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఏపీఎం సంగీత బుధవారం తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

వర్షానికి తడిచిన ధాన్యం



వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఉమ్మడి మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం కురిసిన వర్షానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం నూర్పిళ్లు ప్రారంభం కావడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లు, బండలపై నిలువ చేస్తున్నారు. బుధవారం ఉదయం వర్షం కురవడంతో పలుచోట్ల ధాన్యం తడిచింది.

విద్యార్థుల్లో నైపుణ్యాల మెరుగుకు కృషి



సోమక్కపేటలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో విఠల్

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు నిరంతరం కృషి చేయాలని కొత్తగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు ఎంఈవో విఠల్ సూచించారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో 16 మంది చేరారు. ఈ సందర్భంగా తపస్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారికి స్వాగతం పలికారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం: చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఆదర్శంగా నిలవాలని ఎంఈవో ధనుంజయ అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు జనార్దన్, రంజ్యా, కిష్టయ్య, సత్యనారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.

కొత్త గురువుల రాక

పెద్దశంకరంపేట, కౌడిపల్లి, హవేలిఘనపూర్: కొత్త ఉపాధ్యాయులు బుధవారం ఆయా పాఠశాలల్లో చేరారు. ఆయా పాఠశాలల నుంచి 20 మంది ఎస్జీటీలను రిలీవ్ చేశారు. నూతన ఉపాధ్యాయులకు ఎస్టీయూ, పీఆర్టీయూ సంఘాల బాధ్యులు స్వాగతం పలికారు. ఎంఈవో వెంకటేశం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కౌడిపల్లి మండలంలో ఆరుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారని మండల విద్యాధికారి బాలరాజు తెలిపారు. హవేలిఘనపూర్ మండలానికి ఆరుగురు కొత్త ఉపాధ్యాయులు వచ్చారని మండల విద్యాధికారి మధుమోహన్ తెలిపారు.

ప్రయాణ ప్రాంగణం.. అంధకారం



టేక్మాల్ ప్రయాణ ప్రాంగణంలో విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అయిదేళ్లుగా రాత్రి వేళల్లో చీకట్లోనే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి బస్సుల కోసం బస్టాండ్‌కు వచ్చే వారికి అసౌకర్యంగా మారింది. తాగునీటి సమస్య సైతం వేధిస్తోంది. వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, టేక్మాల్**

రైతులకు ఇబ్బందులు కలగొద్దు: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: వరి కోతలు ప్రారంభమైనందున జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, అక్కడ రైతులు ఇబ్బందులు పడకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవనంలో ఏర్పాటు చేసిన సీపీఎం ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గోనె సంచులు, నీటి సదుపాయం, విద్యుత్తు, రవాణా తదితర వసతులు కల్పించాలన్నారు. ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం ఏరియా కార్యదర్శి మల్లేశం, నాయకులు దేవయ్య, అజయ్‌కుమార్, నాగమణి, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని దంతాన్‌పల్లికి చెందిన గేడి జ్యోతి ఇటీవల పాముకాటుతో మరణించడంతో బాధిత కుటుంబానికి మండల సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లింగం, గొల్ల నాగేందర్, గజేంద్రుల నర్సింలు, దుర్గం ఆంజనేయులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట: కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోతులబొగుడకు చెందిన వెంకటేశ్, తూప్రాన్ మండలం వెంకటాపూర్‌కు చెందిన మన్నె నారాయణ ద్విచక్రవాహనంపై వెళుతుండగా.. నర్సాపూర్- తూప్రాన్ జాతీయ రహదారిపై దొంతి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపైనున్న వెంకటేశ్, మన్నె నారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వెంకటేశ్ స్పృహ కోల్పోయాడు. నారాయణ కాలు విరిగింది. వీరిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వెల్దుర్తి: వెల్దుర్తికి చెందిన వ్యాపారి విఠల్ ఇంట్లోని 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనపర్చుకున్నామని గిర్దావర్ జయభరత్‌రెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం కొని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు విఠల్ ఇంటిపై దాడి చేయగా.. పది క్వింటాళ్ల బియ్యం లభించాయన్నారు. పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్ ప్రణతీరెడ్డికి సమాచారం ఇవ్వగా.. పంచనామా చేసి బియ్యాన్ని రైస్ బిల్లులో భద్రపర్చారన్నారు.

కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించాడని ఆందోళన



రహదారిపై బైఠాయించిన గ్రామస్థులు

రామాయంపేట, న్యూస్‌టుడే: దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని మండల పరిధి దామరచెరువు గ్రామస్థులు ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన ఓ మహిళ అమ్మవారిని అవమానించేలా ప్రవర్తించింది. ఈ విషయమై సంఘం సభ్యులు ఆమెను పిలిచి మాట్లాడారు. ఈ నేపథ్యంలో అక్కడున్న ఓ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించాడని గ్రామస్థులు ఆరోపించారు. ఠాణా సమీపంలో రహదారిపై బైఠాయించారు. విచారించి చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరాజాగౌడ్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎస్సై బాలరాజుకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పట్టణ పరిధి తూప్రాన్ మార్గంలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ ఉన్న పొదలను తొలగించారు. 'పొదల మాటున నియంత్రిక' శీర్షికన ఈనెల 12న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పొదలను తొలగించారు. సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు పరిసరాల్లోకి సిబ్బంది వెళ్లడానికి వీలుగా చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, నర్సాపూర్



అధ్వాన దారి

అల్లాదుర్గంలోని బుడగజంగాల కాలనీకి వెళ్లే రహదారి బురదమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో చాలా అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. **- న్యూస్‌టుడే, అల్లాదుర్గం**

మాజీ మంత్రిని కలిసిన నాయకులు



హరీశ్‌రావుతో నాయకులు

తూప్రాన్, న్యూస్‌టుడే: పురపాలిక మాజీ ఛైర్మన్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బుధవారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి భారాస నాయకులు కృషి చేయాలన్నారు. నాయకులు బాబుల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, సత్యలింగం, మల్లేశం, దుర్గారెడ్డి ఉన్నారు.

భక్తిభావం అలవర్చుకోండి



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న యజ్ఞానంద స్వామీజీ

చేగుంట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని యజ్ఞానంద స్వామీజీ అన్నారు. మండల పరిధి చందాయిపేట వీర హనుమాన్ ఆలయ వార్షికోత్సవాలు రెండ్రోజులుగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన కార్యక్రమంలో స్వామీజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఆధ్యాత్మికతతో ముందుకు సాగితే అన్నింటా విజయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పబ్బా శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఉపసర్పంచి ఆంజనేయులు, శీల వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా కళా ఉత్సవ్ పోటీలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

మెదక్, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు బుధవారం మెదక్‌లో ఘనంగా జరిగాయి. స్థానిక వెలుగు పాఠశాలలో ఏర్పాటు చేసిన పోటీలను డీఈవో రాధాకిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయ, జానపద నృత్యం, చిత్ర లేఖనం, వాయిద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం, న్యాయనిర్ణేతల కమిటీ కన్వీనర్ రామేశ్వర ప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింగరావు, అంజాగౌడ్, మాధవరెడ్డి, ప్రవీణ్, వంశీ, శశిధర్ గౌడ్, గోపాల్, లక్ష్మీప్రసన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రామాయంపేట, న్యూస్‌టుడే: ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు మండల కేంద్రం రామాయంపేటలో ర్యాలీ తీశారు. బుధవారం పట్టణంలోని స్నేహ, ఛత్రపతి డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ తీసి తహసీల్దారు రజనికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు రవి, కరుణాకర్, అధ్యాపకులు దేవేందర్, ప్రవీణ్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తపస్ మండల అధ్యక్షుడిగా భద్రయ్య

వెల్దుర్తి(మాసాయిపేట): తపస్ మండల అధ్యక్షుడిగా మాసాయిపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డి.భద్రయ్య ఎన్నికయ్యారని జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మాసాయిపేటలో నిర్వహించిన తపస్ మండల సమావేశంలో ఎన్నిక నిర్వహించారన్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా బి.ఝాన్సీ, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా మహాలక్ష్మి, కోశాధికారిగా మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

పాదబాటపై విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని మెదక్ మార్గంలో జాతీయ రహదారి పక్కనున్న పాదబాటపై విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. మొదట గోకుల్‌నగర్ కాలనీవాసులు శ్రీనివాస్, దేవేందర్, భిక్షపతి తదితరులు అడ్డుకున్నారు. పాదబాటపై గోతులు తవ్వుతూ స్తంభాలు ఏర్పాటు చేయడమేంటని అభ్యంతరం తెలిపారు. ఏఈ రాజ్‌కుమార్ వద్ద విషయాన్ని ప్రస్తావించగా.. పాదబాట పక్కన పైప్ లైన్లు ఉండటంతో అక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తగ్గిన వరద.. దర్శనమిచ్చిన దుర్గమ్మ



పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం వద్ద గర్భాలయ దర్శనాలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయం వద్ద వరద ఉండడంతో రాజగోపురంలో పూజలు చేశారు. రాత్రికి తగ్గడంతో బుధవారం తెల్లవారుజామున అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి సహస్రనామార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఆలయాలకు భద్రత ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌శర్మ

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: దేవాలయాలకు ప్రభుత్వం పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దేశాయిపేట లింగమూర్తి శర్మ, వైద్య శ్రీనివాసశర్మ, వైద్య ప్రభాకర్‌శర్మ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌శర్మ మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంక్షేమానికి సంఘం ముందుంటుందన్నారు. ప్రతి జిల్లాలో సంఘ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి, ఉపాధ్యక్షుడు వైద్య ప్రభాకర్‌శర్మ, క్రమశిక్షణశాఖ బాధ్యుడు నెమలికొండ కిరణ్ కుమార్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు కాకులవరం వేదవ్యాస్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి భాస్కరమూర్తి పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అవగాహన

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మానసిక వ్యాధితో బాధపడుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా ఉపశమనం కలిగించొచ్చని అంటువ్యాధుల ప్రోగ్రాం జిల్లా అధికారి డా.జ్ఞానేశ్వర్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మానసిక వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయి సింధు, ప్రిన్సిపల్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.